నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 11 సెప్టెంబర్ 2024 | SANGAREDDY

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, సెప్టెంబర్ 10: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పిన హైకోర్టు తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇది చెంపపెట్టు లాంటిదని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అడ్డదారుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఫిరాయింపులను ప్రోత్సహించిన రేవంత్‌రెడ్డి హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను కోరాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలన్నారు.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్ శివారులో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 10: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్, చాల్కి, చీకూర్తి తదితర గ్రామాల్లోని మంజీరా నది తీర ప్రాంతం బ్యాక్ వాటర్‌లో నీట మునిగిన పంటలతోపాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని పాడైపోయిన మినుము, సోయాబీన్, పత్తి, కంది, మొక్కజొన్న, చెరుకు, అల్లం పంటలతోపాటు చాల్కి, చీకూర్తి గ్రామాల సమీపంలోని లోలెవల్ కల్వర్టులను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. మంజీరా నదిలోకి ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో పంట పొలాలు నీటమునిగినీటరని నష్టం జరిగిందని బాధిత రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. భారీ వర్షాలతో మినుము, సోయాబీన్, కంది తదితర పంటలు సైతం దెబ్బతిని తీరని నష్టం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1000 ఎకరాలకు పైగానే పంటలు పాడై రైతులు తీవ్రంగా నష్టపోయినా జిల్లా మంత్రి, మెదక్ ఎంపీ పంట పొలాలను పరిశీలించలేదన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకోవడమే తప్పా మరొకటి లేదన్నారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నివేదిక పంపి ప్రభుత్వ పరంగా నష్టపరిహారాన్ని రైతులకు అందించి ఆదుకోవాలని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, ఏవో అభినాష్‌వర్మలను ఆదేశించారు. మండలంలోని చాల్కి, చీకూర్తి గ్రామాల శివారులోని వరదలకు దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రోడ్ల మరమ్మతులతో పాటు లోలెవల్ కల్వర్టుల స్థానాల్లో హైలెవల్ కల్వర్టులు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు భూమారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహ్మద్‌అలీ, అశోక్‌యాదవ్, ఖైరత్ అలీ, మోహన్‌రెడ్డి, ఆనంద్, ఉమేశ్‌పాటిల్, అరుణ్ తదితరులు ఉన్నారు.

‘మల్లన్న’ క్షేత్రంలో 80 ధర్మశాలల నిర్మాణం

- దోనర్స్ సహకారంతో పనులు
- కొమురవెల్లి మల్లన్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ వెల్లడి

చేర్యాల, సెప్టెంబర్ 10: రాష్ట్రంలోనే ప్రముఖ ఆలయాల్లో ఒక్కటైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న సన్నిధికి రోజురోజుకు భక్తులు భారీగా వస్తుండడంతో వారికి వసతులు కల్పించేందుకు ఆలయవర్గాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాయి. కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో 80 ధర్మశాలలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామి వారి క్షేత్రానికి ప్రతి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని, వచ్చే భక్తులకు గదుల సమస్య ఏర్పడుతున్నదన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవా లు, ఇతర రోజుల్లో వచ్చే భక్తులకు సరిపడా ధర్మశాలలు నిర్మించాలని ఆలయవర్గాలు నిర్ణయించినట్లు తెలిపారు. ఎకరం రెండు గుంటల స్థలంలో ఐదు అంతస్తుల్లో 80 ధర్మశాలలు, ఒక్కో ధర్మశాలకు రూ.12లక్షల50వేల వ్యయం అవుతున్నట్లు తెలిపారు. ధర్మశాలల నిర్మాణం కోసం ఇప్పటికే డోనర్ స్కీం ప్రారంభించామని, ఆసక్తి గల దాతలు డోనర్ స్కీంలో చేరి విరాళాలు అందజేయాలన్నారు. డోనర్ స్కీంలో చేరిన దాతలకు ఆలయవర్గాల నుంచి ఆలయ సంప్రదాయం ప్రకారం మర్యాదలు ఉంటాయన్నారు. ధర్మశాలలు నిర్మించిన దాతలకు బ్రహ్మోత్సవాల సమయంలో ఒక వారం ఉచితంగా కాటేజీ కేటాయింపు ఉంటుందని, ఇతర రోజుల్లో సైతం రుసుం లేకుండా ధర్మశాల ఇస్తామన్నారు. దాతలు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు.

పట్టుకున్న గంజాయి, నిందితులతో సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్, అధికారులు

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- 140కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

కోహీర్, సెప్టెంబర్10: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి పీఎస్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి స్వాధీనం వివరాలను ఆయన వెల్లడించారు. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డితో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి మాడ్గి గ్రామ శివారులోని ఆనంద్‌దాబా వద్ద 65వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారన్నారు. కర్ణాటకలోని బాల్కికి చెందిన లఖణ్, సిద్దిరామ్ కలిసి హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న క్రమంలో బొలెరో వాహనాన్ని తనిఖీ చేశారని చెప్పారు. అందులో 140కిలోల ఎండు గంజాయిని ముంబయి, పూణెకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారని వెల్లడించారు. గంజాయి విలువ రూ.35లక్షల వరకు ఉంటుందని, వాహనంతోపాటు లఖణ్, సిద్దిరామ్‌ను అరెస్ట్ చేశామన్నారు. అక్రమ రవాణాకు సహకరించిన మల్గొండ, రాహుల్, కిరణ్, సునీల్, మల్లేశ్ నాయక్ పరారీలో ఉన్నారని తెలిపారు. 140కిలోల గంజాయితోపాటు బొలెరో, రెండు సెల్‌ఫోన్లు, నాలుగు సిమ్ కార్డులను సీజ్ చేశామన్నారు. సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, పలు విభాగాల ఎస్సైలు రమేశ్, విజయ్, మహేశ్, శ్రీకాంత్, రాజేందర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సంగారెడ్డి డీఎంహెచ్‌వో గాయత్రీదేవి

సంగారెడ్డి, సెప్టెంబర్ 10: ప్రైవేట్ దవాఖానల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న శిశు రక్ష దవాఖానలో తనిఖీ చేయగా దవాఖాన యాజమాన్యం దగ్గర పనిచేస్తున్న డాక్టర్ల వివరాలు, పేషెంట్ల వద్ద వసూలు చేస్తున్న ధరల పట్టికను రిసెప్షన్ వద్ద ప్రదర్శించడం లేదని ఆమె మండిపడ్డారు. అనంతరం దవాఖానలోని ల్యాబ్‌ను సీజ్ చేశారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న చరిత దవాఖానను ఆమె సందర్శించారు. దవాఖానలో సరైన పరిశుభ్రత పాటించకపోవడం, ఫైర్ సేఫ్టీ సిస్టం లేకపోవడం, ల్యాబ్‌లో రికార్డ్స్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సరిగ్గా నిర్వహించకపోవడం కారణంగా ల్యాబ్‌ను సీజ్ చేశారు. చరిత దవాఖాన యాజమాన్యానికి నోటీస్ జారీ చేశారు. తనిఖీలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ దవాఖాన ల్యాబ్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో గాయత్రీదేవి

నల్లవాగు ప్రాజెక్టుకు తగ్గిన వరద

సిర్గాపూర్, సెప్టెంబర్ 10: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 642 క్యూసెక్కుల వరద కొనసాగుతున్నదని అధికారులు మంగళవారం తెలిపారు. వారం రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో రెండు రోజుల్లోనే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. అంతకు ముందు ప్రాజెక్టులో 340 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం 1493 ఫీట్ల వరకు పూర్తిస్థాయి జలాలతో నిండుకుండలా మారింది. ఈనెల 3న ప్రాజెక్టు అలుగు మత్తడి దుంకింది. వారం నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులో 1.2 టీఎంసీల వరద చేరినట్లు ఇరిగేషన్ ఏఈ సూర్యకాంత్ తెలిపారు. ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా 90 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని వదిలామన్నారు. ఈ రెండు పంట కాల్వల కింద ఆయకట్టు పరిధిలోని 10 చెరువులను నింపామన్నారు. చెరువుల కింద 1041 ఎకరాల ఆయకట్టులో వరి సాగవుతున్నట్లు తెలిపారు.

సొసైటీల్లో గోల్‌మాల్!

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సొసైటీలపై ఫిర్యాదులు
- విచారణలో బయటకు వస్తున్న అక్రమాలు
- కీలకంగా మారుతున్న సొసైటీ అధికారులు

సిద్దిపేట. సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సహకార సంఘాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల పలు సొసైటీల్లో చోటు చేసుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం పంట రుణమాఫీ మూడు విడతల్లో చేయడంతో అసలు గుట్టు రట్టవుతున్నది. రైతులకు తెల్వకుండానే సొసైటీ అధికారులు పంట రుణాలు తీసుకొని సొంతానికి వాడుకున్నారు. రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వచ్చే సరికి అసలు విషయం ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గన్నీ బ్యాగులు, పంట రుణాల పంపిణీ, లాంగ్ టర్మ్ రుణాలలోనూ సొసైటీ అధికారులు నిబంధనలకు పాతర వేసి ఇష్టానుసారంగా వ్యవహరించి భారీగా అవినీతికి పాల్పడినట్లు అర్థమవుతున్నది. సహకారమా..? స్వాహా పర్వమా..? అన్న తరహాలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని సొసైటీలు తయారయ్యాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారుల చర్యలు మాత్రం శూన్యం. ప్రతి సొసైటీ అక్రమాల వెనుక జిల్లా స్థాయి అధికారులతో పాటు ఇతర పెద్దల హస్తం ఉండడంతో ‘‘ఆడింది ఆట పాడింది పాట’’ అన్నట్లుగా తయారైంది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రతి సహకార సంఘాన్ని పూర్తి స్థాయిలో విచారణ చేస్తే ఆయా సొసైటీల స్కాంలు బయట పడనున్నాయి. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకొని సొసైటీలపై విచారణ చేపట్టాలని ఆయా సొసైటీల పరిధిలోని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సొసైటీల్లో జరుగుతున్న అవినీతి రోజుకొకటి బయటకు వస్తున్నాయి. ఆయా సొసైటీల సెక్రటరీలు, ఇతర సిబ్బంది కలిసి సొసైటీలను పూర్తిగా అవినీతిమయం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో మెదక్ జిల్లాలోని పలు సొసైటీలు, సంగారెడ్డి జిల్లాలోని రెండు, మూడు సొసైటీలు, సిద్దిపేట జిల్లాలోని మూడు నాలుగు సొసైటీల్లో భారీగా అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో సహకార శాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆయా సొసైటీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపడుతున్నది. ఈ విచారణలో పలు ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) సహకారశాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్నది. డీసీసీబీ పరిధిలోని బ్రాంచీలతో పాటు సహకార శాఖ పర్యవేక్షణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) భారీగా రుణాల గోల్‌మాల్ జరిగింది. సంగారెడ్డి జిల్లాలో 37 సొసైటీల్లో 22,086 మంది రైతులు రూ.212.46 కోట్ల పంట రుణాలు, మెదక్ జిల్లాలో 31 సొసైటీల్లో 29,519 మంది రైతులు రూ.153.76 కోట్ల పంట రుణాలు, సిద్దిపేట జిల్లాలో 15 సొసైటీల్లో 11,980 మంది రైతులు 85.17 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. ఆయా జిల్లాల్లోని సొసైటీల్లో 50శాతం కూడా పంట రుణాలు మాఫీ కాలేదు. మాఫీకాలేని రైతులు సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు. సొసైటీ అధికారులు ఇష్టారీతిగా వ్యవహరించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీల్లో ఎక్కువగా పంట రుణాలకు సంబంధించినవే ఉంటాయి. వ్యాపారం పెంచుకోవడానికి అధికారులు ఆసక్తి చూపుతున్నారు తప్పితే పంట రుణాల లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పీఏసీఎస్‌లో కొంత మంది అధికారులు అక్రమాల కారణంగా నిధులు దుర్వినియోగమవుతున్నాయి. రైతుల ఖాతాలను ఆధార్ అనుసంధానం చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారు. మాకెందుకు పంట రుణమాఫీ కాలేదంటూ రైతులు అధికారులను అడిగితే సరైన సమాధానం రావడం లేదు.

మెదక్ జిల్లా టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

ముత్తంగిలో నీటి ఎద్దడి

- పైప్‌లైన్ సమస్యలతో అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 10: సంగారెడ్డి జిల్లా ముత్తంగి గ్రామ పంచాయతీ పరిధిలో పదిహేను రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. పటాన్‌చెరు మండలం ముత్తంగితో పాటు మరో నాలుగు గ్రామాలను ఓఆర్ఆర్ పరిధిలో ఉన్నాయని, ఈ నెల 3న సమీప తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత పంచాయతీల్లో సేవలు నిలిచిపోయాయి. అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ముత్తంగి గ్రామంలోని పలు కాలనీలకు గత నెల చివరి వారంలో తాగునీటిని వదిలారు. ఆ తర్వాత తాగునీరు సరఫరా నిలిచిపోయింది. సెప్టెంబర్‌లో ఒక్క రోజు కూడా మిషన్ భగీరథ నీరు సరఫరా కాలేదు. దాదాపు 25వేల జనాభా ఈ గ్రామ పరిధిలో నివసిస్తున్నారు. ముత్తంగి గ్రామానికి, దత్తాత్రేయ కాలనీకి ఒక్కో కనెక్షన్‌ను మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి ఇచ్చారు. దత్తాత్రేయనగర్ కాలనీ ద్వారా పలు కాలనీలకు సరఫరా అయ్యే నీరు ఆగిపోయింది. ప్రజలు పంచాయతీ సిబ్బందిని అడిగితే గ్రిడ్ నుంచి నీరు రావడం లేదని చెబుతున్నారు. గ్రిడ్ అధికారులను అడిగితే తాము రెగ్యులర్‌గా నీటిని సరఫరా చేస్తున్నామని సెలవిస్తున్నారు. ఈ విషయంపై విచారిస్తే ముత్తంగి గ్రామ పరిధిలోని పలుకాలనీల్లోని పైప్‌లైన్లలో సమస్యలు ఉన్నట్లు తేలింది. మిషన్ భగీరత ద్వారా కాలనీలకు వేసిన పైప్‌లైన్లను ప్రైవేట్ వ్యక్తులు, పంచాయతీ సిబ్బంది ఇష్టానుసారంగా తవ్వడంతో అనేక చోట్ల మరమ్మతులు వస్తున్నాయి.

సంగారెడ్డి జిల్లా ముత్తంగిలో నీట మునిగిన మిషన్ భగీరథ వాల్వ్

ముత్తంగి పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడం ప్రజల పాలిట శాపంగా మారింది.

రెండు రోజుల్లో సరిదిద్దుతా

ముత్తంగిలోని కొన్ని కాలనీలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయం వాస్తవమే. వరద కారణంగా పైప్‌లైన్లు ధ్వంసమయ్యాయి. రెండు రోజుల్లో వాటికి మరమ్మతు చేసి తాగునీటిని అందజేస్తాం. గ్రిడ్ నుంచి కూడా తాగునీరు సరిపోను రావడం లేదు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తా.

– ముత్తంగి కార్యదర్శి/మున్సిపల్ బిల్ కలెక్టర్ నవోద్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వరద నీటిలో నివాసాలకు వెళ్తున్న కాలనీవాసులు

ముంపుపై ముందుచూపు కరువు

- భారీ వర్షాలు వచ్చినా స్పందించని అధికారులు
- కాలనీలు నీట మునిగినా సహాయక చర్యలు శూన్యం
- శాఖల మధ్య సమన్వయం లేక సంగారెడ్డిలో ముంపునకు గురైన కాలనీలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 10: పేరుకు సంగారెడ్డి గ్రేడ్–1 మున్సిపాలిటీ..వర్షం వస్తే కాలనీలు, రహదారులు, పార్కులు వరదనీటిలో మునిగిపోవాల్సిందే. ముంపుపై ముందుచూపి లేక పట్టణంలోని ఎర్రకుంట పరిధిలోని శ్రీచక్ర కాలనీ, రెవెన్యూ కాలనీ, లాండ్ రికార్డ్స్ కాలనీలు నీట మునిగాయి. వర్షాలు వచ్చినా మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సకాలంలో స్పందించి ఉంటే చెరువులు, కుంటల్లో ఇండ్లు నిర్మించుకున్న వారి పరిస్థితి ముంపునకు గురికాకుండా ఉండేనని ఆయా కాలనీల వాసులు బోరుమంటున్నారు.

నాలాలకు మరమ్మతులు

వరదలో ఉన్న కాలనీల్లో అధికారులు హుటాహుటిన నాలాలకు జేసీబీలతో మరమ్మతులు చేయించి నీటిని తొలిగించారు. చెరువు శిఖంలో నివాసాలు నిర్మించినందు వల్ల వరద ముంపునకు కారణమని అధికారులు తెలిపారు. శిఖంతోపాటు బఫర్‌జోన్‌లో ఇండ్లు నిర్మించుకుని ఉండటం, కాల్వలను పూడ్చివేయడంతో వరద ముంపునకు గురవుతున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ముంపునకు గురికాకుండా చేపట్టాల్సిన చర్యలపై వెంటనే నివేదికలు తయారు చేయాలని సంబంధిత స్థానిక అధికారులను ఆదేశించారు.

కనుమరుగవుతున్న కుడిచెరువు

- ఐబీ,రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- ఎఫ్‌టీఎల్ నిర్ధారించినా ఆగని నిర్మాణాలు
- రియల్ వ్యాపారుల అక్రమ వ్యాపారం
- సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో ఇదీ పరిస్థితి

కొద్దిపాటి వరదతో వెలవెలబోతున్న సిద్దిపేట జిల్లా చేర్యాలలోని కుడి చెరువు

చేర్యాలలోని కుడి చెరువు పరిధిలో ట్రాక్టర్‌తో మట్టిపోస్తున్న రియల్టర్లు(ఫైల్)

చేర్యాల, సెప్టెంబర్ 10 : సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి ఆనుకుని ఉన్న కుడి చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. రియల్ వ్యాపారుల అక్రమణలతో ఉనికి కోల్పోయిన చేర్యాల కుడి చెరువును పరిరక్షించాలని పట్టణ ప్రజలు సర్కారును కోరుతున్నారు. వరంగల్ జిల్లాలో కొనసాగిన సమయంలో నాటి పాలకులు చెరువును కాపాడాలని ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికారులు కాసులకు కక్కుర్తిపడి చెరువును కాపాడే చర్యలు చేపట్టలేదు. కాంగ్రెస్ సర్కారు పెద్దలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే కుడి చెరువుకు పూర్వ వైభవం రానున్నది. 25వేల జనాభా కలిగిన చేర్యాల పట్టణానికి కీలకమైన ఈ చెరువు ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శిఖాన్ని ఆనుకుని అక్రమ లేఔట్ చేసి ఎత్తుగా వేలాది ట్రిప్పుల మొరం, మట్టి నింపి వేయడంతో చెరువులోకి వరద వచ్చే మార్గం లేక కుడి చెరువు కాస్తా ఉనికి లేకుండా పోయింది.చిన్న నీటి పారుదలశాఖ పరిధిలో ఉన్న చేర్యాల కుడి చెరువుకు సర్వే నెం. 202లో 60.21 ఎకరాల శిఖం భూములు ఉన్నాయి. శిఖం ఆనుకుని సర్వేనెం.199,200,201,203,204,205, 1461, 462,1456,1457,1458,1459,1460లో సుమారు 39 ఎకరాల పట్టాభూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఈ భూములను పలువురు రైతులు సాగు చేసుకుంటున్నారు. వర్షాకాలంలో చెరువు నుంచి సమీపంలోని బస్టాండ్, చేర్యాల–సిద్దిపేట ప్రధాన రహదారి వరకు వర్షపునీరు నిల్వ ఉంటుంది. ఈ సమయంలో రైతులు వ్యవసాయం చేయని పరిస్థితి నెలకొంది.రియల్ వ్యాపారం జోరుగా సాగిన సమయంలో (రియల్ వ్యాపారి) దాదాపు కోటి రూపాయలకు ఎకరా చొప్పున 203 సర్వే నంబర్‌లో కొంత భూమిని పట్టాదారుల నుంచి కొనుగోలు చేశాడు. లేఔట్ కోసం 8.24 ఎకరాల భూమార్పిడి కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు ప్రభుత్వ అనుమతి రాక ముందే ప్లాటింగ్ చేశారు.

పూర్వ వైభవం కోసం ఎదురు చూపులు

జిల్లాల పునర్విభజనకు ముందుకు జనగామ ఆర్డీవో చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలిగించాలని ఆదేశాలు జారీ చేశారు. చెరువు శిఖం ఆనుకుని పోసిన మట్టిని సైతం తొలిగించాలని జిల్లా పంచాయతీ అధికారులకు నివేదిక సైతం పంపించారు. కానీ ఐబీ, రెవెన్యూ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరించడంతో కుడి చెరువు పరిస్థితి ‘ఎక్కడ వేసిన గొంగడి అక్కడే’ అన్న చందంగా తయారైంది. కొన్నేండ్లుగా వర్షాలు జోరుగా కురుస్తుండడంతో చెరువులోకి నీళ్లు వచ్చే మార్గాల్లో నిర్మాణాలు ఉన్నాయి. దీంతో చెరువులోకి కొద్దికొద్దిగా నీళ్లు వచ్చాయి. అధికారులు స్పందించి కుడి చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని, చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలు తొలిగించాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలకు నీళ్లు

చెరువు శిఖం ఉన్న ప్రభుత్వ భూములతోపాటు పట్టా భూములైనా వ్యవసాయానికి వినియోగించాలే తప్పా వ్యాపారం చేయవద్దనే నిబంధనలు ఉన్నాయి. కానీ ఆయా శాఖల అధికారుల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా లేఔట్‌లో ప్లాట్లు చేసి విక్రయించడంతో పలువురు నిర్మాణాలు చేసుకున్నారు. నాడు పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో మరి కొన్ని నిర్మాణా లు నిలిచిపోయాయి. పూర్తి స్థాయిలో నిర్మాణాలు కొనసాగిస్తే చెరువులోకి చుక్కనీరు రాని పరిస్థితి. చెరువు పరిస్థితి దుర్భరంగా మారినా రెవెన్యూ, ఐబీ అధికారులు మాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. గతంలో కొందరు స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టి మధ్యలో వదిలిపెట్టారు. మరికొందరు నిర్మాణాలు పూర్తి చేశారు. వ్యాపార అవసరాల పేరిట కొందరు చెరువు భూమిని కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదే భూములకు రెవెన్యూ అధికారులు ల్యాండ్ కన్వర్షన్ ఇవ్వడంతో పలువురు దర్జాగా నిర్మాణాలు చేపట్టారు.

రక్షణకు చర్యలు తీసుకుంటాం

చేర్యాల పట్టణంలో ఉన్న కుడి చెరువు రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటాం. గతంలో చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణతోపాటు హద్దులు ఏర్పాటు చేశాం. ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నిర్మాణాలు ఉంటే తొలిగిస్తాం. చెరువులోకి నీళ్లు వచ్చే అన్ని మార్గాలు సరి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్యామ్, ఐబీ డీఈ చేర్యాల, సిద్దిపేట జిల్లా

వనదుర్గమ్మ దర్శనం ప్రారంభం

పాపన్నపేట, సెప్టెంబర్ 10: మంజీరా నదిలో వరద తగ్గుముఖం పట్టింది. దీంతో తొమ్మిది రోజులపాటు జల దిగ్బంధనంలో చిక్కుకున్న ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం మంగళవారం తెరుచుకుంది. దీంతో గర్భగుడిలో దుర్గమ్మను అర్చకులు ఎరుపు రంగు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వరదల వల్ల రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలో శేరికి చోటు



మెదక్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసన సభాపతి పలు కీలక కమిటీలను సోమవారం నియమించారు. అందులో ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలో సభ్యుడిగా మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలం కూచన్‌పల్లికి చెందిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి చోటు దక్కింది. కమిటీలో స్థానం దక్కినందుకు ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయనకు రాజకీయ కార్యదర్శిగా పనిచేశానని, ఉద్యమంలో కీలకపాత్ర పోషించానని పేర్కొన్నారు.

డెంగీతో వివాహిత మృతి

గజ్వేల్, సెప్టెంబర్ 10: డెంగీతో వివాహిత మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని అహ్మదీపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయిని అనిత(34) రెండు రోజులుగా జ్వరంతో బాధపడింది. జ్వరం తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు గజ్వేల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేసిన అనంతరం వైద్యులు డెంగీగా నిర్ధారించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.